# వెలుగు రేఖలు

- ఎమ్మెస్వీ గంగరాజు

ఆరోజు వచ్చిన ఉత్తరం ఆ ఇంటిలో పెద్ద దుమారమే రేపింది!

"ఈ ఇల్లు నేను లోను తీసుకుని కట్టించుకున్నాను. ఆయనగారు స్థలం కొనడానికి మాత్రమే అరవై వేలిచ్చారు అయిష్టంగా. నాలుగేళ్ళనుంచి ఆయన ఆలనా పాలనా చూస్తున్నాను. ఆ లెక్కలో ఆ అరవై వేలూ ఏ పాటి? ఆ డబ్బు ఇచ్చారు కాబట్టి ఇప్పుడు తిష్టవేసుకుని కూర్చోడానికొస్తున్న కొత్త చుట్టానికి కొంత వాటా ఇవ్వాలనా ఆయనుద్దేశం? అదేం కుదర్దు. కూర్చోబెట్టి ఉద్యోగం సద్యోగం లేనివాళ్లని పోషించడానికిదేమీ ధర్మసత్రం కాదు. ఈ ఇల్లు నాది. నా మాటకి కట్టుబడి వుండటానికిష్టం లేని వాళ్లు వేరే ఇల్లు చూసుకోవచ్చు. ఈ విషయం అందరికీ విడమరచి మరీ చెప్పు- నంగి నంగిగా నసగడం కాదు" ఆఫీసుకి బయలుదేరుతూ దృఢంగా అన్నాడు సన్యాసిరావు భార్యతో.

నిజానికి భార్యతో అంత ధాటిగా మాట్లాడే ధైర్యం లేదు సన్యాసిరావుకి. అయితే, పక్క గదిలో ఉన్న శంకరానికి వినిపించాలనే అలా అన్నాడు. ఆ సంగతి దుర్గకి తెలుసు, శంకరానికీ తెలుసు.

సన్యాసిరావుకేమీ తీసిపోదు భార్య దుర్గ. అసలు ఉదయం వచ్చిన ఉత్తరానికి తీవ్రంగా స్పందించిన మొదటి వ్యక్తి దుర్గే!

"బావగారు ఇప్పుడు వచ్చి ఇక్కడ ఉండటానికి ఆయన ఏమాత్రం ఇష్టపడటం లేదు. రేపు బావగారు వచ్చాక మీరే ఏదో చెప్పి ఆయనని వచ్చిన చోటుకే పంపించేయండి" తను నిమిత్తమాత్రురాలిని మాత్రమేనన్నట్టు మామగారితో చెప్పింది భర్త వెళ్లిపోయాక.

పైసా పెన్షన్ రాని ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేసి రిటైర్మెంటు తీసుకుని, వచ్చిన సొమ్ము కూతురు పెళ్లికీ, కొడుకు చదువుకీ చేసిన అప్పులు తీర్చాక మిగిలిన అరవైవేలూ కొడుక్కి స్థలం కొనడానికిచ్చేసి చేతులు దులిపేసుకుని మిగిలిపోయాడు శంకరం. అంతంత మాత్రంగా లభిస్తున్న ఆ ఇంటి ఆదరణ అతనికి అదనపు వార్ధక్యాన్ని తెచ్చిపెట్టింది.

ఇరవై సంవత్సరాల క్రితం ఇల్లు వదలి వెళ్లిపోయిన పెద్దకొడుకు తిరిగి వచ్చేస్తున్నానని రాసాడు. నాడు సవతి తల్లి దాష్టీకానికి వాడు బలి అవుతూంటే ద్వితీయ కళత్రంపైగల వ్యామోహంతో ప్రేక్షకుడిగా మిగిలిపోయాడు.

"నాన్నా! పెన్ను కొనుక్కోవాలి. పిన్నిని డబ్బులడిగితే లేవంటోంది. ఒక పెన్ను కొనిపెట్టవూ?" దీనంగా అర్థిస్తున్న ఆ పసిమనసుకి ఎంత బాధ కలిగించాయో!

"ఎలాగోలా సర్దుకు పోరా" అన్న తన మాటలు? పెద్ద కొడుకు దూరమయ్యాక తన తప్పు తెలుసుకున్నాడు. చేతులు కాలేక ఆకులు పట్టుకున్న వైనమైంది!

"నామీద ఫిర్యాదులు చేస్తావా?" అంటూ వాతలు పెడుతున్న భార్యను మందలించకపోవడం తను చేసిన ఘోరాతి ఘోరమైన తప్పు! దానికి తనకి పడిన శిక్ష ఇరవై సంవత్సరాల పుత్రవియోగమైతే, ఆవిడకి పడిన శిక్ష అకాల మృత్యువు!

ఈరోజు వాడు, "నాన్నా! నన్ను ఆదుకోవూ?" అంటూంటే ఆదరించలేని నిస్సహాయ స్థితిలో వున్నాడు తను. ఆనాడు వాడు కోరిన కోర్కెని తీర్చగలిగే స్థితిలో వున్నా తీర్చలేకపోయాడు. ఈనాడు వాడి కోరికని తీర్చగల స్థితిలోనే లేడు. ఏదోవిధంగా తనని వెన్నంటే వుంటోంది నిస్సహాయ స్థితి వాడి విషయంలో. భారంగా కళ్లు మూసుకున్నాడు శంకరం.

తర్వాత కోడల్ని సమీపించి, "అమ్మా! వాడు వచ్చిన వెంటనే వెనక్కి పొమ్మంటే బాధపడతాడు. పాపం వాడు చాలా కష్టాల్లో వున్నాడు. ఓ నాలుగు రోజులు వాడిని ఇక్కడ వుండనిచ్చేలా చూడు. ఈలోగా వేరే చోటేదైనా చూస్తాను వాడుండటానికి. ఈ ఇంటిలో వాటా కోసం వాడు పేచీ పెట్టకుండా చూసే బాధ్యత నాది. నాకు తెలిసిన షావుకారు దగ్గర వాడికేదైనా చిన్నపని చూపించాక నేనూ వాడి దగ్గరకే వెళ్లిపోతాను. వాడు మాత్రం ఒక్కడూ ఏం వుంటాడూ?" బతిమాలుతున్న ధోరణిలో అర్థించాడు శంకరం.

అతని చివరి వాక్యాలు రెండూ ఆకట్టుకున్నాయి దుర్గని. చకచకా ఆలోచించింది. నాలుగు రోజులు బావగారిని కూడా వుండనిస్తే అతనితోబాటు మామగారిని కూడా వదిలించుకోవచ్చు. తలవని తలంపుగా వచ్చింది అవకాశం! సద్వినియోగపరచుకోవాలి. "సరే, అలాగే కానీండి. మీ అబ్బాయి వచ్చాక రాత్రికి నచ్చచెప్తాను" అంది దుర్గ.

శంకరం మనసు కాస్త కుదుటపడింది. దుర్గ ఒప్పుకుంటే సన్యాసిరావు ఒప్పుకున్నట్టే. తన గదిలోకెళ్లి పెద్దకొడుకు రాసిన ఉత్తరాన్ని చెమ్మగిల్లిన కళ్లతో మరోసారి చదువుకున్నాడు.

***

ఆరోజు ఉదయం రిక్షాలోంచి దిగాడు చంద్రమౌళి. మాసిన గెడ్డం, గుడ్డలూ, చిందరవందరగా వున్న జుట్టూ, చేతిలో పాత గుడ్డసంచీ... అతడు ఎంతటి దయనీయ స్థితిలో ఉన్నాడో సూచిస్తున్నా, ఆరడుగుల విగ్రహం, దబ్బపండు రంగు శరీర ఛాయా- పెద్దకుటుంబంలో పుట్టిన లక్షణాలు ఉట్టి పడుతున్నాయి.

కొడుకుని ఆప్యాయంగా కౌగిలించుకున్నాడు శంకరం. "ఇన్నాళ్లూ ఏమైపోయావురా నాన్నా?" దుఃఖపు తెరలు అడ్డురాగా కష్టంగా అనగలిగాడు.

అంత వృద్ధాప్యంలో తండ్రిని ఊహించుకోని మౌళి, శంకరాన్ని చూసి విలవిలలాడిపోయాడు.

"అర్థంలేని కోపంతో ఆనాడు ఇల్లు వదిలి వెళ్లి ఏం సాధించగలిగావ్? ఇప్పుడు చూడు, ఇంతవాడివైనా ఎవరిమీదో ఆధారపడవలసి వస్తోంది" ఇంట్లోకడుగు పెట్టగానే తమ్ముడి మాటలు కృంగదీసాయి మౌళిని.

"ఇప్పుడెందుకా మాటలు? వాడిప్పుడే కదా వచ్చింది" శంకరం అడ్డుతగిలాడు చిన్న కొడుకు మాటలకి.

"మీకేం పోయింది? ఎన్నైనా అంటారు. భరించవలసిన వాడిని నేను" గొణుక్కుంటూ లోపలికెళ్లిపోయాడు సన్యాసిరావు.

"అమ్మా! ఈ బూచాడెవరే?" అంటున్న పిల్లల్ని లోపలికి తీసుకెళ్లింది దుర్గ భర్త వెనకాలే.

* * *

తనకోసం తండ్రి పడుతున్న వ్యధని అర్థం చేసుకోగలిగాడు మౌళి. తను నిద్రపోడానికి మంచం, పరుపూ అమర్చి తాను కటిక నేలమీద నిద్రపోతున్న తండ్రిని అర్ధరాత్రి మెలకువ వస్తే చూసి చలించిపోయాడు. మెల్లగా తండ్రి దగ్గరకు వచ్చి తండ్రిని తట్టి లేపాడు.

"నాన్నా! ఇలా నేలమీద పడుకున్నారేమిటి?" అన్నాడు భారమైన మనసుతో.

"ఫర్వాలేదు మౌళీ" అన్నాడు శంకరం తొట్రుపడి లేచి కూర్చుంటూ.

తండ్రిని నిశితంగా చూశాడు మౌళి మసక వెలుగులో.

"నాన్నా! ఒకటడుగుతాను, నిజం చెప్తారా?"

అన్నాడు తండ్రికి దగ్గరగా కూర్చుంటూ.

శంకరం అయోమయంగా చూసాడు మౌళిని.

"తమ్ముడూ, మరదలూ మిమ్మల్ని సరిగా చూడటం లేదు కదూ?"

కొడుకు సూటిగా అడిగిన ప్రశ్నకి ఉలిక్కి పడ్డాడు శంకరం.

"అబ్బే! అదేం కాదు. బాగానే చూసుకుంటున్నారు. నాకేమీ లోటు లేదు."

శంకరం మాటల్లో ఎంత సత్యం ఉందో గ్రహించలేని పసివాడు కాదు మౌళి.

"రేపు ఉదయమే నేను వెళ్లిపోతాను నాన్నా" అంటూన్న మౌళిని విస్మయంగా చూశాడు శంకరం.

"అదేమిటి? మళ్లీ ఎక్కడికి వెళ్లిపోతావ్? ఇక నిన్ను విడిచి నేను వుండలేనురా. నీకు తీరని అన్యాయం చేసాను. నన్ను క్షమించి నాతోనే వుండిపో నాన్నా. ఇక్కడ ఏదో ఉద్యోగం చూస్తాను నీకు. మనం ఇద్దరం వేరే వుందాం" మౌళి చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుంటూ అన్నాడు శంకరం.

ఎన్నో సంవత్సరాల తర్వాత వచ్చిన కొడుకు మళ్లీ దూరం అయిపోతాడన్న ఊహని తట్టుకోలేక పోతున్నాడతడు.

"నా నిర్ణయం కూడా అదే నాన్నా. మిమ్మల్నిక్కడ ఇక విడిచి పెట్టను. రెండురోజుల్లో తిరిగి వచ్చి మిమ్మల్ని తీసుకుని వెళ్లిపోతాను. అక్కడే ఏదో పని దొరకక పోదు" అంటున్న మౌళివైపు మెరిసే కళ్లతో చూస్తూ ఉండిపోయాడు శంకరం.

"అలాగే బాబూ. నాకు కూడా ఏదైనా పని చూసి పెట్టు. చిల్లర కొట్టు లెక్కలు రాయగలను. నీకు కాస్త చేదోడుగా ఉంటాను" అన్నాడు శంకరం.

"అక్కరలేదు నాన్నా. మీరెప్పుడూ నాకు భారం కాదు" దృఢంగా అన్నాడు మౌళి.

ఆ రాత్రి మరి నిద్రపట్టలేదు శంకరానికి. తండ్రి మంచం మీద పడుకునే వరకూ వదలలేదు మౌళి. దిండు తీసుకుని నేలమీద నిద్రపోయాడు తండ్రి ఎంత వారిస్తున్నా వినకుండా.

మౌళి గూర్చి ఆలోచిస్తూ ఉండిపోయాడు శంకరం. మౌళిని ఎంత అప్రయోజకుడిగా ఊహించుకున్నాడు తను? తన ఊహకందని ఎత్తుకి ఎదిగిపోయాడు మౌళి. తండ్రిగా అతడికేమీ చేయకపోయినా తనని కష్టపెట్టకుండా చూసుకుంటాడుట! తనకంటూ ఏ ఆధారమూ లేకపోయినా ఎంత నిబ్బరంగా ఈ నిర్ణయానికొచ్చాడూ?

ఆలోచనలలో తేలుతూ ఆలస్యంగా నిద్రపోయిన శంకరం ఉదయం ఆలస్యంగా నిద్ర లేచేసరికి మౌళి బయలుదేరడానికి సిద్ధంగా వున్నాడు.

"రెండు మూడు రోజుల్లో వచ్చి నాన్నని తీసుకుని వెళ్లిపోతాను తమ్ముడూ" బయలుదేరుతూ అన్నాడు మౌళి సన్యాసిరావుతో.

"అలాగేలే! కాని నీకే స్థిరం లేదు. నాన్నని కూడా ఉంచుకుంటానంటున్నావ్. ఆలోచించుకో" అన్నాడు సన్యాసిరావు కాస్త వెటకారంగా.

***

ఆరోజు సన్యాసిరావు ఆఫీసుకి బయలుదేరడానికి సిద్ధమౌతున్నాడు. శంకరం తన గదిలో ఏదో చదువుకుంటున్నాడు. దుర్గ భర్తకి కేరేజీ సర్దుతోంది.

ఇంటి గుమ్మంలో తెల్లటి అంబాసిడర్ కారొకటి వచ్చి ఆగింది. మీద ఎరుపురంగు లైటూ, ఫ్రంట్ డోర్ తెరుచుకుని బిళ్ల బంట్రోతు దిగడమూ చూసి సన్యాసిరావు అదిరిపడ్డాడు. తలుపు తెరుచుకుని బయటకొచ్చాడు. కారు చప్పుడు విని శంకరం కూడా బయటికొచ్చాడు.

"కొత్త కలెక్టరుగారు ఫ్యామిలీతో వచ్చారు" ఎదురుగా నిలబడి బిళ్ల బంట్రోతు సన్యాసిరావుతో అనడం, వెనక డోర్ తెరుచుకుని మౌళి, అతని భార్యా దిగడం ఒక్కసారే జరిగాయ్.

"నాన్నని తీసుకుని వెళ్లడానికే వచ్చాను తమ్ముడూ" చిరునవ్వు నవ్వుతూ అంటున్నాడు మౌళి మెరిసిపోయే ముఖంతో.

"అన్నయ్యా! ను...వ్వు...?" మాటలు కరువయ్యాయి సన్యాసిరావుకి.

"అవును. నేనే తమ్ముడూ. ఈ జిల్లా కలెక్టర్‌గా నిన్ననే చార్జ్ తీసుకున్నాను. నాన్నా, ఈవిడ మీ కోడలు. మమ్మల్ని ఆశీర్వదించండి" అన్నాడు భార్యతో వంగి తండ్రి పాదాలకి నమస్కరిస్తూ.

అవాక్కై చూస్తూ ఉండిపోయాడు శంకరం. జిల్లా కలెక్టరు హోదాలో కొడుకూ, బంగారు తీగలాంటి కోడలూ వంగి పాదాల్ని తాకుతూ ఉంటే క్షణకాలం స్థంబించినవాడై తేరుకుని ఇద్దర్నీ లేవదీసాడు వణికే చేతులతో.

"ఈ కుటుంబంలో సభ్యునిగా నాకెటువంటి గుర్తింపు ఉందో తెలుసుకుందామని సాధారణ వ్యక్తిగా మొన్న వచ్చి అబద్ధమాడినందుకు మన్నించండి నాన్నా" అంటున్న మౌళిని సంభ్రమాశ్చర్యాలలో తేలుతూ ఆప్యాయంగా అక్కున చేర్చుకున్నాడు శంకరం.

తండ్రి కళ్లలోని ఆనందాశ్రువులనూ, ఆ వెనుక ద్యోతకమౌతోన్న వెలుగు రేఖల్నీ తృప్తిగా చూసుకున్నాడు మౌళి.

★

